సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024



పుణ్యమార్గం.. పేదలకు దానం
ధనికులతో సమానంగా..పేదవర్గాలు కూడా జీవనం గడపాలి. ప్రత్యేకంగా పవిత్ర రంజాన్‌ను ఎలాంటి ఆర్థికపరమైన లోటుపాట్లు లేకుండా జరుపుకోవాలి. -IIలో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది (సా॥)	సహర్ సోమ (ఉ॥)
కడప	: 6.31	4.52
పులివెందుల	: 6.34	4.47
ప్రొద్దుటూరు	: 6.33	4.56

గరిష్టం/కనిష్టం
43.2/24.2

వాతావరణం
జిల్లాలో శనివారం 24.2 – 43.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రమేష్ కుమార్ రెడ్డితో ఎంపీ, ఎమ్మెల్యే చర్చలు



రమేష్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపీలు

లక్కిరెడ్డిపల్లి: రాయచోటి టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రెడ్డెప్పగారి రమేష్‌కుమార్ రెడ్డితో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి శనివారం రాత్రి చర్చలు జరిపారు. రమేష్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

మహిళలకు ఉచిత శిక్షణ

రాయచోటి టౌన్: కెనరా బ్యాంక్ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, పెయింటింగ్‌లపై ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ నిర్వాహకులు శనివారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి శిక్షణ ఉంటుందని చెప్పారు. 18 నుంచి 45 సంవత్సరాల వారు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డుతో నేరుగా వచ్చి కడపలో ఉన్న కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం సంస్థ కార్యాలయం వద్దకు వెళ్లి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440905478/ 9985606866/9440933028 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కొనసాగుతున్న పది మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ హైస్కూల్ మొయిన్‌లో పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం ప్రశాంతంగా సాగుతోంది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 1,96,635 సమాధాన పత్రాలకు 29,527 పత్రాలకు మూల్యాంకనం జరిగిందని డీఈఓ, క్యాంపు అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. మూల్యాంకన కేంద్రంలో సిబ్బందికి అన్ని రకాల మౌలిక వసతులను కల్పించామని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ తెలిపారు.

తలనీలాల విక్రయం ద్వారా రూ.11లక్షల ఆదాయం



తలనీలాల విక్రయానికి వేలం నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో భక్తులు సమర్పించిన తలనీలాల విక్రయం ద్వారా ఆలయానికి రూ.11 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ ఆలవల పాటి ముకుందరెడ్డి తెలిపారు.అలాగే ఎండు కొబ్బరికి రూ.65వేలు వచ్చాయని చెప్పారు. నిలువ ఉన్న తలనీలాలు, ఎండు కొబ్బరి విక్రయానికి శనివారం బహిరంగ వేలం,షీల్డ్ టెండరు నిర్వహించామన్నారు. తలనీలలాను ఏలూరుకు చెందిన వేణుగోపాల్ అధిక ధరతో కొనుగోలు చేశాడని ఆయన తెలిపారు.కార్యక్రమంలో చైర్మన్ కావలి కృష్ణతేజ, సిబ్బంది, పాల్గొన్నారు

యువజనోత్సవాల్లో సత్తా



విద్యార్థులతో కులసచివులు వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్: జాతీయస్థాయి యువజనోత్సవ కార్యక్రమంలో కడప యోగివేమన విశ్వవిద్యాలయ విద్యార్థులు సత్తా చాటారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన దక్షిణ భారత దేశ యువజనోత్సవాల్లో ప్రథమ,ద్వితీయ, తతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి అర్హత సాధించారు.లూథియాన, పంజాబ్ అగ్రికల్చరల్ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు పోటీపడ్డారు.ఇందులో దాదాపుగా 108 విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు పోటీపడగా వారిలో వైవీయూ విద్యార్థులు వై. అరవింద్ (కార్టూన్ విభాగంలో ద్వితీయ స్థానం), డి.రమాజ్యోతి(రంగోలి విభాగంలో తృతీయ స్థానం) , దేవదాసు (పోస్టర్ మేకింగ్ విభాగంలో తృతీయ స్థానం), కె. శ్రీలత (మెహందీ ఆర్ట్స్ విభాగంలో తృతీయ స్థానం) విజేతలుగా నిలిచారు. వీరు యూనివర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య విజయ భారతి, లలిత కళల శాఖ విభాగాధిపతి డా. కె. మత్యుంజయ రావు, బృందానికి నేతృత్వం వహించిన ఆచార్య పుత్తా పద్మ, జి. కాత్యాయని ఆధ్వర్యంలో వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను కలిశారు. విద్యార్థులను ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కులసచివులు ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రధానాచార్యులు ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు.కార్యక్రమంలో లలితకళల విభాగాధిపతి కోట మత్యుంజయ రావు, అధ్యాపకులు సి. హెచ్ వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప నగరం బాలాజీనగర్ రోడ్‌షోలో జనాలు లేక వెలవెలబోతున్న దృశ్యం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న షర్మిల





ఫ్లాప్ షో

- కడప గడపలో షర్మిల రోడ్‌షో అట్టర్ ఫ్లాప్
- జనం లేకపోవడంతో పెద్దదర్గాలో ప్రార్థన పేరిట 2 గంటలు ఆలస్యం
- మసాపేట, దేవునికడప, అప్సర, అంబేడ్కర్ సర్కిల్ సమావేశాలు రద్దు
- అన్నను దూషించడాన్ని అంగీకరించని కడప ప్రజలు
- పీసీసీ చీఫ్ దుస్థితిపై ఆవేదన చెందుతున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కడప: పీసీసీ అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ అభ్యర్థి షర్మిలా ప్రచారం ఫ్లాప్‌షోను తలపించింది. జిల్లా కేంద్రమైన కడపలో కొనసాగిన రోడ్ షో పలు కూడళ్లల్లో ప్రజలు లేకపోవడంతో నేరుగా వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. నిన్న మొన్నటి వరకూ షర్మిలా కడపలో కాలు మోపితే ఎగబడ్డ ప్రజానీకం నేడు తిరస్కరిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టార్గెట్ చేసుకొని నోరు పారేసుకుంటుండమే అందుకు ప్రధాన కారణం. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌పార్టీకి ప్రాతినిథ్యం వహిస్తుండడం, నిరాధార ఆరోపణలతో రాజకీయాలు తెరపైకి రావడం కూడా మరో కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బిడ్డగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లెలుగా కడప గడపలో షర్మిలా కాలుపెడితే జనం బారులు తీరేవారు.యోగక్షేమాలు తెలుసుకునేందుకు ప్రజానీకం ఎగబడేవారు. ఇదే పరిస్థితి రెండు నెలల క్రితం వరకు కన్పించేది. పీసీసీ అధ్యక్షురాలిగా.. కడప ఎంపీ అభ్యర్థిగా రెండు రోజులుగా జిల్లాలో షర్మిలా ప్రచారం నిర్వహిస్తున్నారు. తొలిరోజు కాశినాయన మండలం అమగంపల్లె వద్ద రాజన్న బిడ్డను చూసేందుకు పదుల సంఖ్యలో ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. పోరుమామిళ్ల, బద్వేల్ టౌన్‌లో కూడా ఆ పరిస్థితి కన్పించింది. తొలిరోజు ప్రసంగం విన్న ప్రజానీకం షర్మిలా పర్యటనకు దూరమయ్యారనే చెప్పాలి. అందుకు జిల్లా కేంద్రమైన కడపలో నిర్వహించిన రోడ్‌షో, సమావేశాలే నిదర్శనంగా చెప్పవచ్చు. పెద్దదర్గా దర్శనానికి వచ్చిన ఆమె ముందస్తు నిర్ణయించిన సమయానికి కంటే రెండు గంటలు ఆలస్యంగా పర్యటించినా కనీస స్థాయి ప్రజలు కూడా రోడ్లుపై లేకపోవడం విశేషం.

కాంగ్రెస్ కార్యాలయానికి పయనం...

పెద్దదర్గా వద్ద సమావేశం తర్వాత, మాసాపేట సర్కిల్, దేవునికడప, అప్సరా సర్కిల్, అంబేడ్కర్ సర్కిళ్లలో షర్మిలా ప్రజలనుద్దేశించి ప్రసంగించాల్సి ఉంది. పెద్దదర్గా వద్ద మాత్రమే కాస్తో కూస్తో ప్రజలు కన్పించారు. అక్కడ ప్రసంగించిన ఆమె మాసాపేట మీదుగా నేరుగా దేవునికడపకు వెళ్లాల్సి వచ్చింది. ఆలయ దర్శనం అనంతరం అశోక్‌నగర్, అప్సరా సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్కడ కూడా పట్టుమని పదిమంది ప్రజలు లేకపోవడంతో సాయంత్రం వరకు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోనే తిష్టవేయాల్సి వచ్చింది. పీసీపీ అధ్యక్షురాలు షర్మిలా పర్యటన నీరుగారిపోవడానికి ప్రధాన కారణంగా వ్యక్తిగత దూషణలేనని విశ్లేషకులు తేల్చి చెబుతున్నారు. జిల్లా ప్రజలు ముద్దుబిడ్డలుగా భావించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి లక్ష్యంగా చేసుకొని నిరాధార ఆరోపణలు తెరపైకి రావడంతోనే ప్రజానీకం షర్మిలా దరికి కూడా చేరడం లేదనే పరిశీలకులు వెల్లడిస్తున్నారు. వాస్తవికతకు అనుగుణంగా ఇప్పటికైనా పయనించాల్సిన అవసరం ఉందని పలువురు చెప్పుకొస్తున్నారు. షర్మిలాకు ఇలాంటి దుస్థితి రావడంపై దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులు సైతం ఆమెపై ఆక్రోషం వ్యక్తం చేస్తుండడం విశేషం.



దర్గా సర్కిల్‌లోనూ అదే పరిస్థితి..




ఐటీఐ సర్కిల్‌లోనూ నామమాత్రమే...

భక్తిశ్రద్ధలతో లైలతుల్ ఖదర్

భక్తుల ప్రార్థనలతో కళకళలాడిన మసీదులు

కడప కల్చరల్: రంజాన్ మాసంలో అత్యంత పవిత్రం, అధిక పుణ్యఫలాలను ప్రసాదించేదిగా విశ్వసిస్తున్న లైలతుల్ ఖదర్ (బడీరాత్)ను ముస్లింలు శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దాదాపు అన్ని మసీదుల్లోనూ రాత్రి ఇషా నమాజ్ అనంతరం ప్రత్యేకంగా ఆహ్వానించిన ధార్మిక వక్తలు పవిత్ర ఖరాన్ ప్రత్యేకత, పవిత్ర, అల్లాహ ఆదేశాలు, మానవాళి పాటించాల్సిన విధానాల గురించి తెలియజేశారు. మత గురువులు ఈ రాత్రి పవిత్రత గురించి, చేసే ప్రార్థనల ద్వారా లభించే అధిక పుణ్యం గురించి వివరించారు. మసీదుల్లో భక్తులు పూర్తి రాత్రి ఆధ్యాత్మిక సందేశాలు, పవిత్ర గ్రంథం పఠనం, జికర్‌లో లీనమయ్యారు. అర్ధరాత్రి తజహూద్ నమాజ్ చేసి తమ పాపాలను పోగొట్టి క్షమాబిక్ష ప్రసాదించే అద్భుతమైన క్షణాల కోసం ఎదురుచూసి దైవాన్ని శరణు కోరుతూ గడిపారు. మహిళలు ఇళ్లల్లోనే బంధుమిత్రులను ఆహ్వానించి ఈ ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. మసీదుల నిర్వాహకులు రాత్రంతా ప్రార్థనలతో గడిపిన వారికి ఉదయం ప్రార్థనలకు అంతరాయం లేకుండా మసీదుల్లోనే సెహరీ సౌకర్యం కల్పించారు. రంజాన్ మాసం పవిత్ర వాతావరణం ఎల్లెడెలా కనిపించింది.



విద్యుత్‌దీప కాంతుల్లో కడప నాగరాజుపేట మసీదు

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

రాయచోటి: చాంద్ రాత్(బడీరాత్) సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రంజాన్ పవిత్ర మాసం ముగింపును పురస్కరించుకుని చివరి రెండు రోజుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించే బడీరాత్ కార్యక్రమం అన్నమయ్య జిల్లాలో ఘనంగా జరిగింది. శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు మసీదులు, ప్రత్యేక ప్రదేశాల్లో ఈ ప్రార్థనలు జరుగుతాయి. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 540కి పైగా మసీదులు ఉన్నాయి. రంజాన్ మాసం సందర్భంగా మసీదులన్నింటినీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా పరిధిలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు, రాజంపేట, తంబళ్లపల్లి, రైల్వేకోడూరు నియోజకవర్గాలతో పాటు మండలాలు, గ్రామాల్లో కూడా బడీరాత్ పండుగను వేడుకగా నిర్వహించారు. ఈద్-ఉల్-ఫితర్ లేదా ఈద్-అల్-ఆదా ముందు రాత్రిని సూచించడానికి ఉపయోగించే పదం ఇక్కడ ''చాంద్'' అంటే చంద్రుడు.. ''రాత్'' కాబట్టి ఈ పదం ముస్లింలు నెలవంక లేదా అమావాస్యను చూసే రాత్రిని సూచిస్తుంది. ఈద్ రోజున కొత్త దుస్తులు, గాజులు, ఇతర వస్తువుల కోసం ప్రజలు షాపింగ్ చేసే పండుగ రాత్రి కూడా అంటారు.

కడప టీడీపీ అభ్యర్థి మాధవిరెడ్డిపై కేసులు

కడప అర్బన్: కడప అసెంబ్లీ నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రెడ్డెప్పగారి మాధవీ రెడ్డిపై శనివారం కడపలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఐటీ యాక్ట్ కేసు, తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎం.సీ.సీ) కేసు నమోదు చేశారు.

- కడప వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డిప్యూటీ సీఎం ఎస్‌బీ అంజద్‌బాషాపై సోషల్ మీడియాను వేదికగా తీసుకుని కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్. మాధవిరెడ్డి అక్క ఫ్యాన్స్ పేరుతో అనుచితంగా కామెంట్స్ చేస్తూ ఈనెల 1వ తేదీన పోస్టులు పెట్టారు. ఈ పోస్టింగ్‌లను గమనించిన డిప్యూటీ సీఎం సోదరుడు, వైఎస్‌ఆర్‌సీపి యువనాయకుడు ఎస్‌బీ అహ్మద్‌బాషా ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి ఐటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.
- కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని అక్కాయపల్లిలో సచివాలయంలోకి ఈనెల 5వ తేదీన టీడీపీ అభ్యర్థి ఆర్. మాధవిరెడ్డి తన అనుచరులతో వెళ్లారు. అక్కడ వైఎస్‌ఆర్ పథకాల్లో పింఛన్ల పంపిణీకి తాము అడ్డుకాదనీ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తమ పార్టీ తరఫున ప్రచారం చేశారు. ఈ సంఘటనపై సచివాలయం అడ్మినిస్ట్రేటర్ అరుణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ వెంకటేష్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీపీ) క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రశ్నపత్రాలను ఎమ్మార్సీల నుంచి ఆయా పాఠశాలలకు చేరవేశారు. ఇందులో 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, 9వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12.15 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ విధానంలో జరపగా, 9వ తరగతి వారికి సీబీఎస్‌ఈ విధానంలో పరీక్షలను నిర్వహించారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పరిధిలో 3,32,314 మంది పరీక్షలను రాశారు. ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పరీక్షలకు హాజరైన విద్యార్థులు

కల్పవల్లి.. గంగమ్మతల్లి

- 11న బలిజపల్లె గంగమ్మ జాతర
- నేడు అంకురార్పణ

రాజంపేట టౌన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఎంతో విశిష్టత సంతరించుకున్న బలిజపల్లె గంగమ్మ జాతర నిర్వహణకు నిర్వాహకులు ఆదివారం సాయంత్రం 3 గంటల నుంచి అంకురార్పణ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అందులో భాగంగా బలిజపల్లె గ్రామంలో వెలసిన గంగమ్మ స్వయంభు వద్ద దాదాపు గంటకు పైగా పూజా కార్యక్రమాలను చేపడతారు. మూడు రోజుల పాటు జాతరకు సంబంధించి సంప్రదాయమైన కార్యక్రమాలు చేపట్టి ఈనెల 11వ తేదీ వేకువ జాము నుంచి జాతర ఉత్సవాన్ని ప్రారంభించనున్నారు.


నేడు అంకాలమ్మకు పొంగళ్లు

మండలంలోని తుమ్మల అగ్రహారం బలిజపల్లె గంగమ్మకు పుట్టినిల్లు అని పెద్దలు చెబుతుంటారు. అందువల్ల తుమ్మల అగ్రహారంలో వెలసిన అంకాలమ్మకు బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ చేసే సమయంలో పొంగళ్లు పెట్టడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. అందువల్ల ఆదివారం ఉదయం 9 గంటల నుంచి గ్రామంలోని మహిళలు అంకాలమ్మకు పొంగళ్లు పెట్టనున్నారు. ఇందుకోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.



బలిజపల్లెలో స్వయంభుగా వెలసిన గంగమ్మ

గొడవలకు పాల్పడితే బైండోవర్ కేసులు



బలిజపల్లె గంగమ్మ జాతరకు అంకురార్పణ చేసే సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే వెంటనే పోలీస్ స్టేషన్‌కు తరలించి బైండోవర్ కేసులు పెడతాం. డీఎస్పీ చైతన్య ఆదేశాల మేరకు గంగమ్మ జాతర అంకురార్పణ వేడుక ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం.
– మద్దయ్యఆచారి, అర్బన్ సీఐ, రాజంపేట

గ్రీష్మ తాపంతో జనం విలవిల

- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తప్పనిసరి
- అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్



కడప సెవెన్‌రోడ్స్: భాను భగభగమంటున్నాడు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ జిల్లా నిప్పుల కుంపటిని తలపిస్తోంది. ఉదయం 9 గంటల నుంచే గ్రీష్మతాపం ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు ఎండలు మండిపోతుండడంతో జనం ఇళ్ల నుంచి బయటికి రావాలంటేనే హడలి పోతున్నారు. వృద్ధులు, పిల్లల పరిస్థితి చెప్పాల్సిన పనిలేదు. అత్యవసరమైతే తప్ప బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయరామరాజు సూచిస్తున్నారు.

వడదెబ్బ లక్షణాలు

వేసవిలో అధిక ఉష్ణోగ్రత, వేడిగాలుల కారణంగా వడదెబ్బ, డీ హైడ్రేషన్ సాధారణంగా సంభవిస్తాయి. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా పరిణమిస్తాయి. చెమటపట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు పుట్టడం, మగతనిద్ర లేదా కలవరింతలు, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడం జరుగుతుంది.

వడదెబ్బ సోకకుండా చేయాల్సినవి

నీళ్లు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు అధికంగా తీసుకోవాలి. లేత వర్ణం, తేలికైన, కాటన్ దుస్తులు ధరించాలి. రోజూ కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. శుభ్రంగా రెండు పూటల స్నానం చేయాలి. భోజనం మితంగా చేయాలి. ఎండ వేళ ఇంటిపట్టున ఉండడం శ్రేయేస్కరం. బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి వంటివి తీసుకెళ్లాలి. ఇంటిలో కిటికీలు తెరిచి ఉంచాలి. ఫ్యాన్ వేసి చల్లగా ఉంచుకోవాలి.



జమ్మలమడుగు: ఎండల తీవ్రతకు నిర్మానుష్యంగా ఉన్న ప్రొద్దుటూరు రహదారి

చేయకూడని పనులు

మండు వేసవిలో, తీవ్ర ఉష్ణోగ్రత సమయంలో ఎక్కువగా తిరగరాదు. సూర్య కిరణాలు, వేడి గాలికి గురి కారాదు. రోడ్ల మీద చల్లని, రంగు పానీయాలు తాగరాదు. రోడ్ల మీద అమ్మే కలుషిత ఆహారం తినరాదు. మాంసాహారాన్ని దాదాపు తగ్గించి వేయాలి. మద్యం తాగరాదు. ఎండ వేళల్లో శరీరంపై భారం పడే పనులు చేయరాదు. నలుపు, మందం దుస్తులు ధరించరాదు.

ప్రథమ చికిత్స

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడి వస్త్రంతో శరీరాన్ని తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు ఇలా చేస్తూ ఉండాలి. చల్లని గాలి తగిలేలా ఫ్యాన్ కింద ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిగిన గ్లూకోజ్ ద్రావణం లేదా ఓరల్ హై డ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాపించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీళ్లు తాగించకూడదు. వీలైనంత త్వరగా సమీపంలోని పీహెచ్‌సీకి రోగిని తరలించాలి.

సుర్రుమంటున్న సూరీడు

కడప అగ్రికల్చర్: భానుడు రోజురోజుకు తమ ప్రతాపం చాటుతున్నాడు. శనివారం జిల్లాలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. నాలుగు రోజుల నుంచి జిల్లాలో క్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగున్నాయి. సోమవారం 41 డిగ్రీలు నమోదుకాగా మంగళవారం 42.4, బుధవారం 42.2 డిగ్రీలు, గురువారం 43.4 డిగ్రీలు, శుక్రవారం 42.8, శనివారం యధాప్రకారం 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

చెన్నూరు : కడప – రాజంపేట బైపాస్‌లో గల జీత్ డాబా సమీపంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రాజంపేట నుంచి ఇర్కాన్ సర్కిల్ వైపు వెళుతున్న వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి ముఖం గుర్తుపట్టలేని విధంగా దెబ్బ తినడంతో.. అతని ఆచూకీ తెలియరాలేదని సీఐ పార్థసారథి తెలిపారు. ఎర్ర చొక్కా ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు.

చీరకు నిప్పంటుకొని..

కడప అర్బన్ : కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిలకలబావి దగ్గర నివాసం వుంటున్న మురాద్‌బీ (70) అనే వృద్ధురాలు ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం వడలు కాల్చుతుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని ప్రమాదానికి గురైంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు గమనించి ఆమెను కాపాడి కుమార్తె మునీరాబీకి సమాచారం ఇచ్చారు. వెంటనే ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ సంజీవరాయుడు తెలియజేశారు.

పుణ్యమార్గం.. పేదలకు దానం

ధనికులతో సమానంగా.. పేదవర్గాలు కూడా జీవనం గడపాలి. ప్రత్యేకంగా పవిత్ర రంజాన్‌ను ఎలాంటి ఆర్థికపరమైన లోటుపాట్లు లేకుండా జరుపుకోవాలి. ఇది ఇస్లాం తత్వం. సమానత్వంతో కూడిన జీవనాన్ని నిర్దేశిస్తోంది. దాన, ధర్మాలు, ధార్మిక సత్కార్యాలకు రంజాన్ మాసం అధిక ప్రాధాన్యత ఇస్తోంది.

- రంజాన్ మాసంలో దానధర్మాలకు ప్రాధాన్యం
- ప్రతి వ్యక్తి పేరిట కొంత మొత్తం అందజేత
- ఈ ఏడాది ఫిత్రా రూ.90గా ఖరారు







రాజంపేట టౌన్/ మదనపల్లె సిటీ : రంజాన్ మాసంలో జకాత్, ఫిత్రా ఇస్తారు. ఫిత్రా అనే పదానికి అర్థం తనతోపాటు ఇతరులకు సంతోషాన్ని ఇవ్వడం. ఈ నేపథ్యంలో ప్రతి వ్యక్తి పేదలకు దానం చేయాలని ఇస్లాం ఆదేశించింది. ఒక కుటుంబంలో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉన్నా.. అందరి పేరిట పేదలకు దానం చేయాలని సూచించింది. రంజాన్ రోజున ప్రత్యేక నమాజు ఆచరించక ముందే ఫిత్రా చెల్లించాలంటూ ఆదేశించింది. ఇది ఒక విధిగా నిర్దేశించింది. దానం విధిగా మారడానికి హదీసులో ఇలా ఉంది. ఉపవాసి చిన్న చిన్న పొరపాట్లను దూరం చేయడానికి, పేద వారు కూడా అందరితో కలిసి పండుగను ఘనంగా జరుపుకోవడానికి దానం ఉపయోగపడుతుంది.

ఏ రూపంలో చెల్లించాలి

సాధారణ స్థితిలో ఉన్న ప్రతి ముస్లిం 1750 గ్రాముల గోధుమలు లేకుంటే అంత సమానమైన డబ్బును పేదలకు దానం చేయడమే ఫిత్రా. ఈ ఏడాది మార్కెట్ ధరలకు అనుగుణంగా పెద్దలు రూ.90 ఖరారు చేశారు. అలాగే జావ 3.5 కేజీలు లేదా రూ.245, ఖర్జూరం 3.5 కిలోలు లేదా రూ.1050 కూడా చెల్లించవచ్చు. 52.50 గ్రాముల వెండి లేదా 75 గ్రాముల బంగారం లేదా అంత విలువైన ధన, ఆస్తులు కలిగివుండే ప్రతి ముస్లిం జకాత్‌కు అర్హుడు. తమ సొమ్మును లెక్కకట్టి అందులో నుంచి 2.5 శాతం పేదలకు పంచాలి.

70 రెట్ల పుణ్యం

కల్మా, నమాజ్, రోజా, జకాత్, హజ్ అనేవి ఇస్లాంకు మూల స్తంభాలు. జకాత్ ఇచ్చిన వారి సొమ్మును అల్లాహ్ రక్షించడమే కాకుండా వృద్ధి చేస్తారని మౌల్వీలు చెబుతున్నారు. సాధారణ రోజుల్లో కంటే రంజాన్ మాసంలో జకాత్ ఇచ్చే వారికి 70 రెట్ల పుణ్యం అధికంగా లభిస్తుందని, పరలోకంలోనూ లాభం చేకూర్చుతుందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. జకాత్ ఇవ్వడం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయి. జకాత్ ఇవ్వని, రోజా ఉండని వ్యక్తిలో వ్యాపార ఆలోచన ఏర్పడుతుందని, తన లాభం చూసుకొని ఇతరుల బాధలు పట్టించుకోరని, ఇది ఇస్లాంకు వ్యతిరేకమని మౌల్వీలు చెబుతున్నారు.

ఎవరు చెల్లించాలి.. ఎవరికి చెల్లించాలి

- ధనవంతులు కాకపోయినా, కనీస ఆదాయ వనరులు ఉన్నవారు సైతం తమ కంటే పేద వారికి ఫిత్రా చెల్లించాలి.
- పండుగ నమాజుకు ముందుగా ఇంట్లో సంతానం కలిగితే శిశువు పేరు మీద కూడా దానం చేయాలి. పేద వర్గాలకే కాకుండా పేద విద్యార్థులు చదువుకునే మదర్సాలకు సైతం సమకూర్చవచ్చు.

జకాత్ తప్పనిసరి



రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం జకాత్, ఫిత్రా ఇవ్వడం తప్పనిసరి. ఇస్లాంలో జకాత్ ఇవ్వడం కచ్చితమైనది. పంచ నియమాల్లో ఇది ఒకటి. దీనివల్ల అల్లాహ్ వారి ఆరోగ్యాలను కాపాడటంతోపాటు సిరిసంపదను వృద్ధి చేస్తారు.

– షేక్ అబ్దుల్లా, సంఘసేవకుడు, రాజంపేట

ధన, ఆరోగ్య బీమా



మనిషి ఆరోగ్యం, ధన సంపదల బీమా జకాత్. ఏడాదికి ఒకసారి తన సంపదనలో నిర్ణీత వెండి, బంగారు విలువపై 2.50 శాతం లెక్క చేసి తదనుగుణంగా పేద ముస్లింలకు సహాయం చేయాలి. ముందు తమ రక్తసంబంధీకులు ఎవరైనా పేదలు ఉంటే వారికి వారికి ఫిత్రా ఇవ్వడం ఉత్తమం.

– గౌస్‌బాషా, రాజంపేట

ప్రతి ముస్లిం పాటించాలి



ఫిత్రా దానాన్ని ప్రతి ముస్లిం కచ్చితంగా పాటించాలంటూ ఇస్లాం నిర్దేశించింది. ఉపవాస దీక్ష సమయంలో దీక్షాపరుని చెడు తలంపు, చెడు ఆలోచనలు, నోటి నుంచి వెలువడే అసత్యాలు.. వంటి పొరపాట్లన్నీ క్షమార్హం అవుతాయంటూ మహ్మద్ ప్రవక్త(సల్లెల్లాహు అలైహివ సల్లం) చెప్పారు.

– హాఫీజ్ ఇక్బాల్‌అహ్మద్, ప్రభుత్వ సర్ఖాజీ, మదనపల్లె

మద్యం తరలిస్తున్న టీడీపీ నేతల అరెస్ట్

- పోలీసుల అదుపులో ఇద్దరు
- మరో ఇద్దరు పరారీ
- 240 బాటిళ్లు స్వాధీనం
- పంచలింగాల చెక్‌పోస్ట్ వద్ద పట్టివేత

చాపాడు : సార్వత్రిక ఎన్నికలలో ఎలాగైనా గెలవాలనే ఉద్దేశంతో టీడీపీ నాయకులు ఎలాంటి పనులు చేయడానికైనా బరి తెగించారనేందుకు ఉదాహరణగా.. శనివారం రాత్రి తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తూ కర్నూలు సరిహద్దులో పట్టుబడిన సంఘటన ద్వారా తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందిన టీడీపీ నాయకులు జాకీర్, బాషా, లాల్ బాషా మరో వ్యక్తి తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా కర్నూలు జిల్లాలోని పంచలింగాల చెక్‌పోస్ట్ వద్ద ఏపీ పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటనలో తెలంగాణకు చెందిన 240 మద్యం బాటిళ్లు పట్టుకుని జాకీర్, బాషా అనే వ్యక్తులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారైనట్లు చెక్‌పోస్ట్ పోలీసు సిబ్బంది తెలిపారు. కర్నూలు జిల్లాలోని తుంగభద్ర నది సమీపంలోని అలంపూరు సమీపంలో పంచలింగాల వద్ద పోలీసులు చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు శాఖకు చెందిన ఇద్దరు ఎస్‌ఐలు సైతం మద్యం తరలిస్తున్న వ్యక్తులకు సహకారం అందించినట్లు చెక్‌పోస్ట్ పోలీసులు గుర్తించారు. అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తుల ఫోన్ పే నుంచి ఇద్దరు ఎస్‌ఐల ఖాతాలకు డబ్బులు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించినట్లు సమాచారం. అక్రమంగా మద్యం పట్టివేత ఘటనపై ఆదివారం పోలీసులు విలేకరులకు బహిర్గతం చేయనున్నట్లు సమాచారం. అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వ్యక్తులు ఇటీవల మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. పార్టీలో చేరే క్రమంలో ఖాదర్‌పల్లె గ్రామంలో పెద్ద ఎత్తున విందు ఏర్పాటు చేసి పుట్టా వద్ద తమ సత్తా చాటుకున్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి భావనారాయణనగర్‌లోని కల్లూరి సుబ్బమ్మ (83) శనివారం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక అస్వస్థతకు గురైన ఆమె మధ్యాహ్నం సమయంలో మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

- 'సిట్' ప్రత్యేక దర్యాప్తు బృందం ఆధ్వర్యంలో ఛేదన
- మరింత క్షుణ్ణంగా విచారణ చేపడతాం
- కడప డీఎస్పీ షరీఫ్ వెల్లడి



వెల్లడిస్తున్న కడప డీఎస్పీ షరీఫ్

కడప అర్బన్ : పెండ్లిమర్రి మండలం యాదవాపురానికి చెందిన ఆదిమూలం శ్రీనివాసులు (35) అనే వ్యక్తి చిన్నదాసరపల్లి గ్రామ పొలాల్లో ఈ నెల 2వ తేదీన హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఐదుగురు నిందితులను 'సిట్' ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారి, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ వెంకటరాముడు పర్యవేక్షణలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం కడప- పులివెందుల ప్రధాన రహదారిలో కాశినాయన గుట్ట వద్ద అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై శనివారం సాయంత్రం కడప డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వివరాలు వెల్లడించారు. ఈ హత్య కేసులో నిందితులైన చిన్న గురివిరెడ్డిగారి నాగిరెడ్డి అలియాస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిన్న గురివిరెడ్డిగారి నాగిరెడ్డి, చిన్న గురివిరెడ్డిగారి రామసుబ్బారెడ్డి, చిన్న గురివిరెడ్డిగారి నాగిరెడ్డి అలియాస్ చిన్ననాగిరెడ్డి, చిన్నగురివిరెడ్డిగారి రామసుబ్బారెడ్డి అలియాస్ డేగా అనే ఐదుగురిని అరెస్ట్ చేశామన్నారు. ఈ నెల 2వ తేదీన పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లి గ్రామ పొలాల్లో అనుమానాస్పదంగా చనిపోయిన ఆదిమూలం శ్రీనివాసులును హత్య చేశారని ఆరోపిస్తూ మృతుడి తమ్ముడు ఆదిమూలపు వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పెండ్లిమర్రి పోలీసులు విచారణ చేపట్టారన్నారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ వెంకటరాముడు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం 'సిట్'ను ఏర్పాటు చేశారన్నారు. ఈ ప్రత్యేక బృందం ద్వారా అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలియజేశారు. నిందితులలో చిన్న గురివిరెడ్డి గారి నాగిరెడ్డి వద్ద నుంచి టీషర్ట్, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. ఈ హత్య కేవలం భూమి సమస్య తగాదా వల్లనే జరిగినట్లు తెలియజేశారు. సదరు గ్రామ పరిధిలో 70 సెంట్ల భూమి సంబంధించి సమస్య ఇరువర్గాల మధ్య తలెత్తినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. ఈ భూమి సమస్య వలనే హత్య జరిగిందన్నారు. ఈ కేసును ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తున్నామని, మరికొందరి పాత్ర ఇందులో వుందని తేలిన వెంటనే వారిని కూడా అరెస్ట్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కంభగిరి రాముడు, కడప రూరల్ సీఐ నాగరాజు పాల్గొన్నారు.

వ్యాపారి నుంచి రూ.8.50 లక్షల స్వాధీనం

కడప అర్బన్ : పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన శిధర్ అనే పూతరేకుల హోల్‌సేల్ వ్యాపారి శనివారం బ్యాంక్‌లో డిపాజిట్ చేసేందుకు రూ.8.50 లక్షలను కడపకు తీసుకుని వచ్చారు. కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఎస్పీ బంగళాకు వెళ్లే మార్గంలో కడప వన్‌టౌన్ ఎస్‌ఐ రంగస్వామి తమ సిబ్బందితో కలిసి చేసిన తనిఖీలలో ఈ వ్యాపారి పట్టుబడ్డాడు. ఎన్నికల సమయంలో రూ.50 వేల కంటే ఎక్కువగా తీసుకుని వెళ్లకూడదనే నిబంధనల మేరకు అతని దగ్గరున్న డబ్బును స్వాధీనం చేసుకుని.. కడప ఆర్డీఓ మధుసూదన్‌కు ఎస్‌ఐ తమ సిబ్బందితో కలిసి వ్యాపారి సమక్షంలోనే అప్పగించారు. తదుపరి ఆర్డీఓ తగిన చర్యలు తీసుకోనున్నారు.

అదుపు తప్పిన కంటైనర్



రోడ్డుపై పడిన కంటైనర్ లారీ

నందలూరు(రాజంపేట) : కడప–చెన్నై జాతీయ రహదారిలో తహసీల్దార్ కార్యాలయం మలుపు వద్ద శనివారం తెల్లవారు జామున చెన్నై నుంచి మహారాష్ట్రకు టైర్ల లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమి కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎస్‌ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ సంఘటనా స్థలానికి చేరుకుని కంటైనర్‌ను అక్కడి నుంచి తొలగించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

గువ్వలచెరువు ఘాట్‌లో లారీ బోల్తా

చింతకొమ్మదిన్నె : కడప – రాయచోటి ప్రధాని రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో శుక్రవారం అర్ధరాత్రి మూడవ మలుపు వద్ద సిమెంటు ట్యాంకర్ లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి నష్టం జరగలేదు. రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని క్రేన్ సాయంతో తీసివేసినట్లు ఏఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాతబస్టాండ్ సమీపంలో అవధూతేంద్ర స్వామి గుడి ఎదురుగా శనివారం కడప-ప్రొద్దుటూరు నాన్-స్టాప్ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మైదుకూరు మండలం సాయినాథపురానికి చెందిన పండిట్ దేవరాజు (69) అనే వృద్ధుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. అతన్ని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప ఒన్‌టౌన్ ఎస్‌ఐ రంగస్వామి తెలియజేశారు.


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరుతున్న ఇడమడక గ్రామస్తులు

దువ్వూరు : మండలంలోని ఇడమడక గ్రామంలో శనివారం టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. గ్రామానికి చెందిన బోగాది పెద్దనరసింహులు యాదవ్, పాములేటి యాదవ్, నరసయ్య యాదవ్, కనగాని రమణయాదవ్, బాల ఉగ్రంయాదవ్‌లతోపాటు 25 కుటుంబాల వారికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిరాకి బాషా, నగరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌కుమార్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలని ఓపీడీఆర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ న్యాయవాది ఆర్.రామ్‌కుమార్ కోరారు. శనివారం ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కమిటీ సమావేశాలు నగరంలోని హరిత హోటల్‌లో శుక్ర, శనివారాలు (రెండు రోజుల పాటు) జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో జరగబోతున్న ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో జరగనీయకుండా బీజేపీ ప్రభుత్వం అనేక రూపాలలో ఎన్నికల వ్యవస్థలు, ఇతర రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల బాండ్ల రూపంలో రూ.6 వేల కోట్లకు పైగా అక్రమంగా సేకరించి రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్షాలను అణచివేసే పద్ధతిలో ముందుకు పోతోందని విమర్శించారు. కుల, మత విద్వేషాలను రెచ్చగొడుతూ అదనంగా ధన బలాన్ని ఉపయోగిస్తూ ప్రజల ఓటు హక్కు పై దాడి చేస్తోందన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర విభజన చట్టం 2014లోని అన్ని అంశాల అమలు కోసం తమ విధానాలను రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఓపీడీఆర్ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.ఈశ్వర్, జి.సంగీతరావు, శివారెడ్డి, ఆమెన్ పీరా, కరుణాకర్ రావు నరసింహులు, కె.ఉపేంద్ర, ఎస్.నారాయణమ్మ పాల్గొన్నారు.